నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, ఆదివారం 31 మార్చి 2024 | JAGTIAL

ముగిసిన 'పది' పరీక్షలు

ఈ నెల 17న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారం ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 219 సెంటర్లు ఏర్పాటు చేయగా, మొత్తం 38,097 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలు ముగియడంతో హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. దీంతో బస్టాండ్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో రద్దీగా మారాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

రైతు నిరసన దీక్షలో పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి, తదితరులు

ఆదుకునే దాకా పోరాటం ఆపం

- రేవంత్ సర్కార్ మొద్దు నిద్ర వీడాల్సిందే
- పంటలకు సాగునీరివ్వాల్సిందే
- ఎండిపోయి నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాల్సిందే
- కాంగ్రెస్ మళ్లీ పదేండ్ల కింది పాలన తెచ్చింది
- అన్నదాతలను అరిగోస పెడుతున్నది
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- 36 గంటల రైతు నిరసన దీక్ష ప్రారంభం



హాజరైన నాయకులు, కార్యకర్తలు, రైతులు

పెద్దపల్లి, మార్చి 30(నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి: 'కాంగ్రెస్ వంద రోజుల పాలనతో మళ్లీ పదేండ్ల కిందటి దుస్థితి వచ్చింది. నమ్మి ఓటు వేస్తే.. అధ్వానమైన పాలనతో అన్ని వర్గాల ప్రజలను అరిగోస పెడుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో ఎవుసానికి ఎలాంటి కష్టాలుండేవో రేవంత్ సర్కార్ వచ్చినంక మళ్లీ మొదలైనయ్. సాగు బాటలో ఉండాల్సిన రైతులు నీటి కోసం, కరెంటు కోసం రోడ్లకపైకి వచ్చి ఆందోళన చేస్తున్నరు. కాలువల్లో నీళ్లు రాక రైతులు కన్నీరు కారుస్తున్నా ఈ సర్కారు ఏ మాత్రం చలించడం లేదు. మొద్దు నిద్ర పోతున్నది' అని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. సాగునీరందక పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.25 వేల పరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, వారిని ఆదుకునేదాకా ప్రభుత్వంపై పోరాడుతామని స్పష్టం చేశారు. నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలని, మొద్దు నిద్రపోతున్న రేవంత్ సర్కార్‌ను తట్టి లేపి రైతులకు న్యాయం జరిగేలా చూడాలనే లక్ష్యంతో రైతు నిరసన దీక్ష చేపట్టామని చెప్పారు. ఈ మేరకు శనివారం పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో '36 గంటల రైతు నిరసన దీక్ష'ను చేపట్టారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అధ్యక్షతన ప్రారంభమైన ఈ దీక్షలో కొప్పుల ఈశ్వర్ పాల్గొని, మాట్లాడారు. కేసీఆర్ సర్కారు పదేళ్లుగా రైతులు, ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నదని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చిన వంద రోజుల్లోనే ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన దరిద్రం మళ్లీ వచ్చిందని మండిపడ్డారు. రైతులకు కష్టాలు, కన్నీళ్లే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు ఇప్పటి వరకు 20 లక్షల ఎకరాల పంట పొలాలు సాగునీరందక ఎండిపోయాయని ఆందోళన చెందారు. ఎండిన పంటను తగులబెట్టడం, పశువులను మేపుతూ రైతులు బోరున విలపిస్తున్నా రేవంత్ సర్కార్ కరగడం లేదని, కనీసం ఎండిపోతున్న పంటల సర్వే సైతం చేపట్టడం లేదని విమర్శించారు. ఎద్దేడ్చిన ఎవుసం.. రైతేడ్చిన రాజ్యం పూర్తికాలం నిలువదని, కాంగ్రెస్ సర్కారుకు రైతుల గోస తప్పకుండా తగులుతుందన్నారు. పాలన చేతగాక ఇతర పార్టీల మీద విమర్శలు చేస్తున్నారని, ఎమ్మెల్యేలు, నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నారి మండిపడ్డారు. ఝూటా మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులను రాజులను చేయడమే లక్ష్యంగా అనేక సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి బీడు భూములకు సాగు నీరందించారని గుర్తు చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీలు బండారి స్రవంతి శ్రీనివాస్, నూనేటి సంపత్, బాలాజీరావు, జడ్పీటీసీలు బొద్దుల లక్ష్మణ్, గంట రాములు, తగరం సుమలత శంకర్‌లాల్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పెంట రాజేశ్, ఉప్పు రాజ్‌కుమార్, అత్తె చంద్రమౌళి, మాదాడి శ్రీనివాస్‌రెడ్డి, కర్రు నాగయ్య, గోనె శ్రీనివాస్‌రావు, కొయ్యడ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డీ ఖబడ్దార్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఆగం చేస్తున్నడు. మాయ మాటలు చెప్పి ప్రభుత్వంలోకి వచ్చిండు. ఆరు గ్యారెంటీలని చెప్పి వాటిలో రెండు గ్యారెంటీలను కూడా అమలు చేయలేదు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అని చెప్పి గౌరవంగా బస్సుల్లో ప్రయాణించే మహిళలను అవమానాల పాలు చేస్తున్నడు. మాయ మాటలు చెప్పే రేవంత్‌రెడ్డి ఖబడ్దార్. రైతులను ఆదుకోవాలె. లేకుంటే నీ కుర్చీ ఉండది.. నువ్వు ఉండవ్.. జాగ్రత్త!

- మోకినపల్లి రాజవ్వ, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు

నీళ్లడిగితే దాడులు చేస్తున్నరు

కాంగ్రెస్ పాలనలో వంద రోజుల్లోనే ₹16 వేల కోట్ల అప్పు చేసిన్రు. అయినా ప్రజల బతుకులకు భరోసా లేదు. పంటలు ఎండిపోతున్నయి. నీళ్లు కావాలని అడిగితే దాడులకు దిగుతున్నరు. ఇకపై దాడులు చేస్తే సహించేది లేదు. ప్రజలకు బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏ హాని జరిగినా ఊరుకునేది లేదు. కంటికి రెప్పలా కాపాడుకుంటం.

- దాసరి ఉష, బీఆర్ఎస్ నాయకురాలు

దీక్షలో పాల్గొన్న మహిళలు

ఆదుకునేదాకా పోరాడుతం

గతేడాది మాదిరిగానే ఈ సారి యాసంగికి నీళ్లు వస్తాయని రైతులు వరి వేసిన్రు. కానీ, నిరాశే మిగిలింది. సాగునీరు అందక పంటలు ఎండుతున్నయి. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం చలనం లేదు. వెంటనే ప్రభుత్వం స్పందించాలి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం దిగొచ్చి ఆదుకునేదాకా పోరాడుతం.

- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

పార్లమెంట్ ఎన్నికల్లో పాతరేయాలి

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఎక్కడా ఒక్క ఎకరం కూడా ఎండనివ్వలేదు. కానీ, కాంగ్రెస్ పాలనలో కరువు పరిస్థితులు వచ్చినయి. సాగునీరందక రైతులు రోడ్డెక్కుతున్నరు. అయినా ఎండిన పంట పొలాలను ఎవరూ పరిశీలించడం లేదు. రైతులకు భరోసా ఇవ్వడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పత్తా లేకుండా పోయిన్రు. నష్టపోయిన రైతులకు ఎకరానికి ₹25 వేల చొప్పున పరిహారం చెల్లించాలి. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రా..? రాక్షసుడా..? ఓట్లేసిన ప్రజల పేగులు మెడలో వేసుకుంటావా..? ఇలాంటి కాంగ్రెస్‌ను ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో పాతరేయాలి. ఒక్కసీటు కూడా ఇవ్వకుండా బుద్ధి చెప్పాలి.

- బాల్క సుమన్, మాజీ విప్

దీక్షలో బాల్క సుమన్

వంద రోజుల్లోనే రైతుల అరిగోస

కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాలన అందించింది. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత రైతులు అరిగోస పడుతున్నరు. ఆ పార్టీ వంద రోజుల పాలనలో 200 మంది ఆత్మహత్య చేసుకున్నరు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రైతులే గుణపాఠం చెబుతరు. యావత్ తెలంగాణ రైతాంగాన్ని కదిలించేలా 36 గంటల రైతు నిరసన దీక్ష చేస్తున్నం. ఇది ఆరంభం మాత్రమే. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం. ఇంకా ముస్ముందు పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడుతం. అన్నదాతకు అండగా నిలుస్తం.

- కోరుకంటి చందర్, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు

ప్రజలే గుణపాఠం చెబుతరు

కేసీఆర్ సర్కారు రైతులను అన్ని విధాలా ఆదుకున్నది. కానీ, కాంగ్రెస్ సర్కారు మాత్రం గోస పెడుతున్నది. ఎన్నికల ముందు అలవికాని హామీలతో నమ్మించింది. రైతుబంధు కూడా సంపూర్ణంగా ఇచ్చే పరిస్థితి లేదు. రైతు ప్రోత్సాహకంగా ఇస్తామన్న రూ.500 జాడ లేదు. ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. పోయిన పదేళ్లలో ఏనాడూ సాగునీటికి ఇబ్బంది పడదేదు గానీ, ఇప్పుడు నీళ్లు లేక ఒక్క పెద్దప ల్లి నియోకవర్గంలోనే 50 వేల ఎకరాల్లో పంటలు ఎండి పోయినయి. రైతులు నష్టపోయిన్రు. ప్రజలు అన్ని గమ నిస్తున్నరు. రాబోయే రోజుల్లో గుణపాఠం చెబుతరు.

- దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మార్పంటే పంటలు ఎండబెట్టుడేనా..?

'రాష్ట్రంలో కాంగ్రెస్ వస్తుంది. మార్పు తెస్తుంది' అని చెప్రిను. మార్పంటే అందరు ఏదో అనుకున్నరు. మార్పంటే పంటలను ఎండబెట్టుడేనా..? ఇదేనా కాంగ్రెస్ పాలన? రైతులకు సంపూర్ణంగా సాగునీరందించాలి. వంద రోజుల్లో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తమన్నరు. 200 మంది రైతుల ఉసురు తీసిన్రు. ఇంకా నాలుగేళ్ల వారి దుష్ట పాలనలో మరింత నష్టం జరిగే ప్రమాదమున్నది. ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి.

- చిరుమల్ల రాఖేశ్, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్

దీక్షా శిబిరంలో నిద్రిస్తున్న కొప్పుల, పుట్ట మధూకర్, కోరుకంటి, దాసరి, తదితరులు

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పూలమాల వేస్తున్న రైతు

కదిలివచ్చిన కర్షకలోకం

ఎండుతున్న పంటలకు నీళ్లివ్వాలని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యాన చేపట్టిన '36 గంటల రైతు నిరసన దీక్ష' చేపట్టారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి రైతులు కదిలివచ్చారు. శనివారం ఉదయం 8గంటలకు పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి వీర తిలకం దిద్ది పూల మాలలు వేసి దీక్షలో కూర్చోబెట్టారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు ఈ దీక్ష సాగనుండగా, శనివారం రాత్రి అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా 'జై కేసీఆర్' 'జైజై కేసీఆర్' అంటూ జైకొట్టారు. కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నినదించారు. 'రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్' నినాదాలతో హోరెత్తించారు. కొంత మంది రైతులు తమ పొలాల్లో ఎండిన వరిని తీసుకొచ్చి నిరసన తెలిపారు. ప్రభుత్వం తక్షణమే దిగి వచ్చి రైతులను ఆదుకోవాలని, రైతును కన్నీరు పెట్టిస్తున్న రేవంత్ సర్కార్ తక్షణమే గద్దె దిగాలని ముక్తకంఠంతో నినదించారు. కాగా, దీక్షలో అనేక సార్లు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

కొత్తపల్లి ఎంపీపీ, వైస్ ఎంపీపీలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంగుల, బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

'ఉపాధి హామీ'లో కొత్తపల్లి స్టేట్ ఫస్ట్

ప్రజాప్రతినిధులను అభినందించిన ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కొత్తపల్లి, మార్చి 30 : ఉపాధి హామీ పథకంలో కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి మండలం రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఫలితాల్లో ముందంజలో నిలిచింది. ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కువ మంది కూలీలకు పని కల్పించడంతోపాటు నాణ్యతగా పనులు చేపట్టినందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ర్యాంక్‌లను విడుదల చేసింది. రాష్ట్రంలో కొత్తపల్లి మండలం ఫస్ట్ ర్యాంకును, భద్రాది కొత్తగూడెం జిల్లాలోని అన్నపురెడ్డిపల్లి మండలం రెండో ర్యాంక్‌ను కైవసం చేసుకోగా, వికారాబాద్ జిల్లా బంతారం మండలం మూడో స్థానం, వికారాబాద్ మండలం నాలుగో స్థానం, కరీంనగర్ జిల్లాలోని గన్నేరువరం మండలం ఐదో స్థానంలో నిలిచాయి. కాగా, రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధనకు కృషిచేసిన ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ గౌడ్, వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్, ప్రజా ప్రతినిధులు, అధికారులను శనివారం కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అభినందించారు. కొత్తపల్లి మండలం ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

వాళ్లు మేకతోలు కప్పుకున్న తోడేళ్లు

- కడియం, కేకే తెలంగాణ ద్రోహులు
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజం

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 30 : అధికారం కోసం తిరిగి కాంగ్రెస్ పంచన చేరుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు మేక తోలు కప్పుకున్న తోడేళ్లని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఘాటుగా విమర్శించారు. తమ స్వార్థ రాజకీయాల కోసం రంగులు మార్చుతున్న వారిని చూసి ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల చేతిలో చావు దెబ్బ తిని చరిత్ర హీనులుగా మారుతారని జోస్యం చెప్పారు. దమ్ముంటే తమ పదవులకు రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలిచి చూపాలని సవాల్ విసిరారు. కార్యకర్తల బలమున్న బీఆర్ఎస్ కొత్త నాయకులను తయారు చేస్తుందని స్పష్టం చేశారు. కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడియం, కేకేపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏ పదవీ లేకుండా ఇంట్లో ఉన్న కడియంను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దగ్గరకు తీసి ఉపముఖ్యమంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా అవకాశమిచ్చి ఉన్నత స్థాయికి తెచ్చారని, కేశవరావును కాంగ్రెస్ ఛీకొడితే కేసీఆర్ అక్కున చేర్చుకుని పార్టీ సెక్రటరీ జనరల్‌గా, రాజ్యసభ సభ్యుడిగా అవకాశమిచ్చారని గుర్తుచేశారు. అడ్రస్ తెలవని కడియం కూతురికి టికెట్, అలాగే కేకే కూతురు హైదరాబాద్ మేయర్ పదవి కేసీఆర్ పెట్టిన భిక్షేనన్నారు. ఆ నాయకుల తీరు తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా ఉందని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువవడంతోనే బీఆర్ఎస్ నాయకులను లాక్కుంటున్నారన్నారు. ఇన్నాళ్లు అధికారం అనుభవించి ఏ మాత్రం సిగ్గు లేకుండా ఇతర పార్టీల్లోకి పోతున్న వారి గురించి తెలంగాణ సమాజం ఆలోచించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతుల కిచ్చిన హామీల్లో కొన్నైనా అమలు చేయకపోవడం కాంగ్రెస్ సర్కారు దుర్నీతికి నిదర్శనమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తుండడంతో కక్షగట్టి కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా చేసిన వారిని మాత్రమే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, బీఆర్ఎస్ యువజన విభాగం నగర అధ్యక్షుడు దీకొండ కులదీప్, నాయకులు ఆరె రవిగౌడ్, షౌకత్‌అలీ, శ్రీనివాస్ రెడ్డి, బొంకూరి మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మానసిక వైద్యుల సంఘం బాధ్యులు

నేడు మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర సదస్సు

విద్యానగర్, మార్చి 30 : భారత మానసిక వైద్యుల సంఘం రాష్ట్ర శాఖ 9వ వార్షిక పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్ డెవలప్మెంట్-2024 (నిరంతర వృత్తి నైపుణ్య) సదస్సును ఆదివారం కరీంనగర్‌లోని ప్రతిమ రేజెన్సీ హోటల్‌లో నిర్వహించనున్నట్లు కరీంనగర్ మానసిక వైద్యుల సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ భాగ్యరెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ కేకే లక్ష్మణ్, ఉపాధ్యక్షులు డాక్టర్ పీ కిషన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఎన్‌డీ సంజయ్ కుమార్, కోశాధికారి డాక్టర్ సాయికృష్ణ, కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ ఎల్ వార్షి తెలిపారు. ఈ మేరకు వారు ప్రతిమ హోటల్ వద్ద మాట్లాడారు. మానసిక వైద్యవిభాగం -ప్రతిమ వైద్య విజ్ఞాన సంస్థ, కరీంనగర్ మానసిక వైద్యుల సంఘం ఆధ్వర్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 'మానసిక సమస్యలపై మానసిక వైద్యుల్లో పరిశోధనల సామర్థ్యం పెంపొందించడం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని, పరిశోధనలు ఎందుకు నిర్వర్తించాలి, పరిశోధనల ఆవశ్యకతలు, దేశంలో మానసిక సమస్యల స్థితిగతులు ఎలా తెలుసుకోవాలి, పరిశోధనలు సమాజానికి ఎలా తోడ్పడుతాయి, భవిష్యత్తులో సమాజంలో వచ్చే సమస్యలను ఎలా పసిగట్టాలి? అనే అంశాలపై కూలంకశంగా శిక్షణ ఇస్తునట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో గల మానసిక వైద్య విద్యార్థులు సుమారు 250 మంది హాజరవుతున్నాని, దేశంలోని ప్రముఖ మానసిక వైద్య విభాగ ప్రొఫెసర్‌లు శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్యుల సంఘం బాధ్యులు, కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ కే పవన్, డాక్టర్ బీ పురుషోత్తం, డాక్టర్ ఆర్ శివకుమార్, డాక్టర్ జీ ప్రీతి, డాక్టర్ ఎల్ వర్షి, డాక్టర్ ఎం పృథ్వీరెడ్డి, డాక్టర్ ఎన్ రవి కుమార్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్ సీఐపై బదిలీ వేటు

- వారం కిందటే చార్జి మెమో
- ఇది వరకే స్టేషన్‌లో పదకొండు మందిపై చర్యలు

వేములవాడ, మార్చి 30 : వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్‌పై బదిలీ వేటు పడింది. గతేడాది జూలైలో బదిలీపై వచ్చిన ఆయన విధుల్లో బాధ్యతారాహిత్యం, అవినీతి ఆరోపణల నేపథ్యంలో తొమ్మిది నెలలకే మళ్లీ బదిలీ వేటు పడింది. ప్రజలకు జవాబుదారీతనంతో మెదులుకొని సేవలందించాలని ఇప్పటికే ఎస్పీ అఖిల్ మహాజన్ పలుసార్లు హెచ్చరించినా అధికారులు, పోలీస్ సిబ్బందిలో మార్పు రాకపోవడంతో బదిలీ వేటు పడినట్టు తెలుస్తున్నది. మహాశివరాత్రి జాతర సందర్భంగా వ్యాపారుల నుంచి నగదు వసూలు, సమస్యలు విన్నవించేందుకు వచ్చే ప్రజలపై బాధ్యతారహిత్యంగా నడుచుకోవడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించినట్లు తెలిసింది. అనేక ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన పోలీసు ఉన్నతాధికారులు చివరకు శనివారం ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ బదిలీ వేటు వేశారు. అయితే, ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలోనూ విఫలమయ్యారని ఈ నెల 22న ఎస్పీ అఖిల్ మహాజన్ ఐదుగురు కానిస్టేబుళ్లు, ఐదుగురు హోంగార్డులతో కలిపి మొత్తం పది మందిని హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. ఇదే సమయంలో ఎస్‌హెచ్‌వోకు చార్జ్ మెమో కూడా ఇచ్చారు. వారం రోజుల్లోనే వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి పదకొండు మందిపై చర్యలు తీసుకోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కరుణాకర్ సెలవులో ఉండగా ప్రస్తుతం వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.